
సాక్షి
ఒడిశా
శుక్రవారం । 17 । నవంబర్ । 2023



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం గురువారం లెక్కించారు. ఇందులో నగదు రూ.6,26,452లు, బంగారం 400 మిల్లీగ్రాములు, వెండి 42 గ్రాములు 300 మిల్లీగ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



పత్రికా విలువలు పెంచుదాం

ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చి పత్రికల విలువలు పెంచుదామని సీనియర్ జర్నలిస్టులు పిలుపునిచ్చారు. ఈ మేరకు రాష్ట్రవ్యాప్తంగా గురువారం జాతీయ పత్రికా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.

- 8లో



'పూర్వ వైభవం తీసుకురావాలి'

కొరాపుట్ జిల్లా జయపురంలోని చారిత్రాత్మక జగన్నాథ్ సాగర్‌కు పూర్వ వైభవం తీసుకురావాలని జగన్నాథ్ సాగర్ అభివృద్ధి ట్రస్టు డిమాండ్ చేసింది.

- 8లో

పనులకు పచ్చ జెండా..

- శ్రీమందిరం లోపల పనులకు అనుమతి
- ఒడిశా నూతన సంవత్సరానికి పూర్తి చేసేందుకు చర్యలు
- నిర్ణయం తీసుకున్న ఆలయ అధికార వర్గం



పాలక మండలి సభ్యుల సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

భువనేశ్వర్: పూరీ జగన్నాథుని ఆలయం లోపల మరమ్మతుల నిర్వహణ ఇతరేతర అనుబంధ కార్యకలాపాలు శుక్రవారం నుంచి పూర్తిస్థాయిలో చేపడతారు. ఈ మేరకు శ్రీమందిరం అధికార వర్గం అనుమతించింది. శ్రీమందిరం ప్రధానపాలన అధికారి రంజన్ కుమార్ అధ్యక్షతన ప్రత్యేక సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సమావేశానికి భారత పురావస్తు శాఖ (ఏఎస్ఐ) అధికారులు, శ్రీమందిరం సాంకేతిక, పాలక మండలి సభ్యులు హాజరయ్యారు. మందిరం నాట్య మండపం, జగమోహన మండపం పనులు గురువారం నుంచి చేపట్టాలని రాష్ట్ర హైకోర్టు ఏఎస్ఐకి ఆదేశించిన విషయం తెలిసిందే. ఈ పనులు చేపట్టేందుకు శ్రీమందిరం పాలక మండలి అనుమతి అనివార్యం కావడంతో అత్యవసర సమావేశం ఏర్పాటు చేశారు. దేవస్థానం సముదాయం లోపల కట్టడాలు, నిర్మాణాల స్థితిగతుల దృష్ట్యా అనుబంధ నిర్వహణ పనులు చేపట్టే అంశాలను హైకోర్టు ఆదేశాల పరిధిలో క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం ఏఎస్ఐ ఈ పనులు చేపట్టేందుకు నిరభ్యంతర అనుమతి (ఎన్‌ఓసీ) మంజూరు చేశారు. సమావేశంలో మరమ్మతుల పనులతో ఆలయ సంరక్షణ కార్యాచరణ, స్వామి సేవాదుల కోసం 3 కొత్త రత్న పల్లకీలు, పాత వాటి మరమ్మతులు, దివ్యాంగులకు ప్రత్యేక దర్శన సౌకర్యం ప్రధానాంశాలుగా చర్చించినట్లు ఆయన పేర్కొన్నారు.

ఉదయం 6 గంటల నుంచి..

నిత్యం ఉదయం 6 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు నిరవధికంగా మరమ్మతులు చేసేందుకు అనుమతించారు. ఈ కార్యకలాపాల కోసం అవసరమైన తాత్కాలిక ఏర్పాట్లు చేసేందుకు వెసులుబాటు కల్పించారు. ఈ వ్యవహారాలను శ్రీమందిరం సాంకేతిక నిపుణుల కమిటీ మరియు నిర్వహణ కమిటీ సేవా సభ్యులు ప్రత్యక్షంగా పర్యవేక్షిస్తారు. ప్రస్తుతం కార్తీక మాసం రద్దీ కొనసాగుతుంది. ఈ నేపథ్యంలో భక్తులు, యాత్రికులకు ఎటువంటి అసౌకర్యం లేకుండా జాగ్రత్తగా పనులు నిర్వహించాల్సి ఉంటుందని తెలిపారు. రద్దీ నియంత్రణ కార్యకలాపాల్లో ఆలయ కమాండర్, సూపర్‌వైజర్ ఏఎస్ఐ వర్గాలకు సహాయ సహకారాలు అందజేస్తారు. ప్రధాన దేవస్థానంలో సేవాదులకు అంతరాయం లేకుండా అనుకూలమైన సమయం ఈ వర్గాలు ఖరారు చేసిన మేరకు నిత్యం పనులు చేపట్టాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. సమగ్రంగా హైకోర్టు ఆదేశాల మేరకు శ్రీమందిరం నాట్య మండపం, జగమోహన మండపం పనులను 120 రోజుల గడువులోగా పూర్తి చేయాల్సి ఉంది. మంటపంలోని ఒక బీమ్‌లో పగుళ్లు ఉన్నాయని ఏఎస్ఐ తెలిపారు.

పొణా సంక్రాంతి నాటికి సిద్ధం

స్వామి సేవకు వినియోగించే పాత పల్లకీల నిర్వహణ పనులకు సేవా సబ్ కమిటీ ఆమోదించింది. కొత్త పల్లకీలు వచ్చే ఏడాది పొణా సంక్రాంతి తిథి నాటికి సిద్ధం చేసేందుకు కాల పరిమితి కేటాయించారు. ఒడియా నూతన సంవత్సరాది పురస్కరించుకుని స్వామి సేవలో సరికొత్త పల్లకీలను ప్రవేశ పెట్టే సంకల్పంతో ఈ మేరకు కాల పరిమితి నిర్ధారించడం విశేషం. సప్తమూర్తుల ప్రభల మరమ్మతుల పనులను చేపడతారు. నారాయణుడు, మదన మోహనుడు, భూదేవి, శ్రీదేవి, మాధవ, అమావాస్య మూర్తి ప్రభల పనులు పొణా సంక్రాంతి నాటికి పూర్తి చేసేందుకు నిర్ణయించారు. వచ్చే ఏడాది చందన యాత్రకు ముందే ఈ పనులు పూర్తయ్యి కొత్త పల్లకీలతో సప్తమూర్తులు సిద్ధమవుతాయి.

దివ్యాంగ భక్తులకు ప్రత్యేక దర్శనం

స్వామి దర్శనార్థం విచ్చేసే దివ్యాంగులకు ప్రత్యేక సౌకర్యం కల్పించాలని నిర్ణయించారు. నిత్యం సగటున 30 నుంచి 40 మంది దివ్యాంగ భక్తులు, యాత్రికులు స్వామి దర్శనం కోసం విచ్చేస్తున్నారు. శ్రీ మందిరం ఆవరణలో వీరి కోసం ప్రత్యేక కేంద్రం తెరిచారు. ఈ కేంద్రంలో దివ్యాంగుల వివరాలు నమోదు చేయాల్సి ఉంటుంది. ఈ కేంద్రం నుంచి దివ్యాంగులకు చక్రాల కుర్చీలో లోపలకు తీసుకుని వెళ్లి సులభ దర్శనం సౌకర్యం కల్పించేందుకు ఏర్పాట్లు చేశారు. అంచెలంచెలుగా ఈ వర్గీయ భక్తులకు మరిన్ని సదుపాయాలు త్వరలో ప్రవేశ పెట్టనున్నట్లు పేర్కొన్నారు. దివ్యాంగుల కోసం ప్రత్యేక విరామ శిబిరాలు, ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ వంటి సౌకర్యాలు త్వరలో అందుబాటులోకి వస్తాయి.

మఠాల పనులు

శ్రీ మందిరం అనుబంధ మఠాల నిర్వహణ పనులు కొనసాగుతున్నాయి. వచ్చే ఏడాది మే నెలలోగా ఈ పనులను పూర్తి చేసేందుకు యోచిస్తున్నారు. ఒడిశా బ్రిడ్జి నిర్మాణ కార్పొరేషన్ (ఓబీసీసీ), ఆలయ ఆర్కిటెక్టు నిపుణులు ప్రతిపాదించిన డిజైను ప్రకారం మఠాల పునరుద్ధరణ, పునర్నిర్మాణ పనులు జరుగుతున్నట్లు సీఏఓ వివరించారు.

పాన్, గుట్కా నిషేధం కట్టుదిట్టం

శ్రీ మందిరం సిబ్బంది, స్వామి సేవకులు, దర్శనానికి విచ్చేసే భక్తులు, యాత్రికులు పాన్, గుట్కా సేవించడం నిషేధించారు. ఈ ఆంక్షలను కట్టుదిట్టంగా అమలు చేస్తున్నారు. ఈ కార్యాచరణ ఆలయ సిబ్బంది నుంచి ఆరంభించినట్లు తెలిపారు. ఆలయ సిబ్బంది కార్యాలయం పరిసరాలు, విధి నిర్వహణ సమయంలో వీటిని సేవిస్తున్నట్లు దృష్టికి వస్తే తక్షణమే విధుల నుంచి తొలగించి బయటకు పంపివేస్తున్నారు. పలు ప్రాంతాల నుంచి విచ్చేసే యాత్రికులు, భక్తులకు అవగాహన కల్పించేందుకు ప్రాధాన్యత కల్పిస్తున్నారు. దృష్టిని ఆకట్టుకునే ప్రధాన కూడలి తదితర ప్రాంతాల్లో పాన్, గుట్కా నిషేధిత ఆంక్షల ప్రచార పోస్టర్లు ఏర్పాటు అవుతాయి. ఈ నేపథ్యంలో జరిమానా చెల్లించకుండా పరిపూర్ణ భక్తి పూర్వక హృదయంతో ప్రతి ఒక్కరు స్వచ్ఛందంగా సహకరించే రీతిలో అవగాహన ప్రచార కార్యక్రమం చేపడుతున్నట్లు వివరించారు.

● నడవలేని వారికి ప్రత్యేక సౌకర్యం

స్వామి దర్శనం కోసం విచ్చేసే నడవలేని భక్తుల కోసం అదనపు ప్రత్యేక సౌకర్యం కల్పిస్తారు. ఈ వర్గపు భక్తులను చక్రాల కుర్చీలో శ్రీ మందిరం ఉత్తర ద్వారం ఆవరణ వరకు తీసుకుని వెళ్తారు. అక్కడ నుంచి ప్రధాన ఆలయం లోపలికి అనుమతించ దగ్గ ప్రత్యేక (పోలీ కార్బనేటు కుర్చీ) ఉపకరణాల సహాయంతో ఆలయ సేవకులు జయ – విజయ ద్వారం వరకు తీసుకుని స్వామి దర్శనం చేయించి సురక్షితంగా బయటకు తీసుకుని వస్తారు. ఉత్తర ద్వారం దాటిన తర్వాత ఎటువంటి వాహన సౌకర్యం ఆలయం ఆచారాల ప్రకారం అనుమతించబడనందున ప్రత్యామ్నాయ సౌకర్యం ఏర్పాటు చేశారు. ఈ ప్రత్యేక సదుపాయం తాత్కాలికంగా నిత్యం ఉదయం 10 నుంచి 11 గంటల వరకు మాత్రమే పరిమితం చేయాలని నిర్ణయించారు. రెండో విడతలో మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ప్రత్యేక సౌకర్యంతో నడవ లేని భక్తులకు దర్శన సౌకర్యం అందుబాటులో ఉంటుందన్నారు. భోగ మండపం సేవ, సాధారణ భక్తుల రద్దీ లేని సమయంలో దివ్యాంగ భక్తులకు ప్రత్యేక దర్శన సౌకర్యం కల్పిస్తారు. ఈ మేరకు తుది కార్యక్రమం ఖరారు చేస్తారు. త్వరలో 36 నియోగుల సంఘం ప్రతినిధులతో సమావేశమై ఈ మేరకు దివ్యాంగుల ప్రత్యేక దర్శన సౌకర్యం వేళల్ని ఖరారు చేస్తారు.

న్యూస్‌రీల్

సమస్యలపై ప్రభుత్వం శీతకన్ను



మాట్లాడుతున్న సుభాష్ సాహు తదితరులు

బరంపురం: గంజాం జిల్లాలో సమస్యలపై బీజేడీ ప్రభుత్వం శీతకన్ను వహిస్తోందని జిల్లా బీజేపీ అధ్యక్షుడు డా.సుభాష్ సాహు అన్నారు. స్థానిక కేకే వర్సిటీ రోడ్‌లోని అభినందన కల్యాణ మండప ప్రాంగణంలో విలేకరుల సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలోని సమస్యలను ప్రభుత్వం గాలికొదిలేసిందని మండిపడ్డారు. సమస్యలను వివరిస్తూ 17 ఎన్ఏసీలు మరియు 22 బ్లాక్ కార్యాలయాల ఎదుట ఆందోళనలు చేపట్టనున్నట్లు తెలియజేశారు. సమావేశంలో కన్ను చరణ్ పతి తదితరులు పాల్గొన్నారు.

రైతుల కష్టాలపై గవర్నర్‌కు వినతి



గవర్నర్‌కు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

భువనేశ్వర్: రాష్ట్రంలో రైతుల కష్టాలు తీరడం లేదని, 23 ఏళ్ల సుదీర్ఘ పాలనలో బిజూ జనతా దళ్ ప్రభుత్వం రైతులను నిర్లక్ష్యం చేస్తోందని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర రైతు మోర్చా శాఖ ఆవేదన వ్యక్తం చేసింది. ఈ నేపథ్యంలో గవర్నర్ రఘుబర దాస్‌కు 6 ప్రధాన డిమాండ్లతో కూడిన వినతిపత్రం గురువారం సమర్పించింది. రాష్ట్రంలో 73 శాతం ప్రజలు వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నారు. కానీ రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయం మరియు రైతుల సంక్షేమానికి ఏమాత్రం ప్రాధాన్యత ఇవ్వడం లేదన్నారు. రైతులను ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి ప్రణాళిక రూపొందించలేదని ఆరోపించారు. అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రైతుల అభ్యున్నతి కోసం అనేక పథకాలు రూపొందించినా, ఈ పథకాలను ఒడిశాలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయలేదన్నారు. ఒడిశా రైతులు విషాదంలో, నిరాశలో ఉన్నారని, దీనిపై చర్యలు తీసుకోవాలని కోరారు. వినతిపత్రం అందజేసినవారిలో రైతు మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు మహేశ్వర్ సాహు ఉన్నారు.

బీజేపీ నాయకుల ఆందోళన

పర్లాకిమిడి: రాష్ట్రంలో అవినీతి పెరిగిపోయిందని, మహిళలపై అత్యాచారాలు జరుగుతున్నాయని బీజేపీ నాయకులు అన్నారు. ఈ మేరకు గుమ్మా సమితి కార్యాలయం వద్ద గురువారం ఆందోళన చేపట్టారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు మరియు ఎమ్మెల్యే కోడూరు నారాయణ రావు ఆధ్వర్యంలో గుమ్మా బస్టాండ్ నుంచి సమితి కార్యాలయం వరకు వెళ్లి ఆందోళనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నారాయణరావు మాట్లాడుతూ అమొ ఒడిశా, నవీన్ ఒడిషా పథకం ద్వారా రూ.3,700 కోట్లు లూటీ చేయడానికి పథకం పన్నారని ఆరోపించారు. ఆందోళనలో కాశీనగర్ సమితి మాజీ చైర్మన్ చిత్రి సింహాద్రి, గుమ్మా బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

క్షీణించిన స్వామీ స్వరూపానందగిరి ఆరోగ్యం



రాయగడ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న స్వరూపా నందగిరి స్వామి

- మెరుగైన చికిత్సకు బరంపురం తరలింపు

రాయగడ: జిల్లాలోని కల్యాణ సింగుపూర్‌లో ఉన్నటువంటి శైవక్షేత్రమైన దేవగిరి వద్దనున్న క్రాంతికారి ఆశ్రమంలో ఉంటున్న స్వామీ స్వరూపానంద గిరిపై బుధవారం దాడి జరిగిన విషయం తెలిసిందే. దీంతో తీవ్ర అస్వస్థతకు గురైన ఆయనను స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి బుధవారం రాత్రి తరలించారు. దుండగుడు పదునైన ఆయుధంతో తలపై దాడి చేయడంతో తీవ్రగాయాల పాలయ్యారు. దీంతో ముందుగా కల్యాణ సింగుపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స చేయించుకుని తిరిగి ఆశ్రమానికి వెళ్లిపోయారు. అయితే అదేరోజు రాత్రి ఆయన ఆరోగ్యం పూర్తిగా క్షీణించడంతో సహచరులు వెంటనే స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి అంబులెన్స్‌లో తరలించారు. అక్కడ చికిత్స అందించిన వైద్యులు తలపై గాయాలు తీవ్రంగా ఉండడంతో, మెరుగైన



అంబులెన్స్‌లో బరంపురం తరలిస్తున్న దృశ్యం

చికిత్స కోసం గురువారం తెల్లవారు జామున బరంపురం తరలించారు. ఈ ఘటనపై పోలీసులు ఇంత వరకు ఎవరినీ అరెస్టు చేయలేదు. స్వామిపై దాడిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు ఆధ్యాత్మికవేత్త స్వామీ శ్రీచైతన్య రాంజీ ఆవేదన వ్యక్తం చేశారు. ఇటువంటి ఘటనలు భవిష్యత్‌లో పునరావృతం కాకుండా పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఒక ఆశ్రమంలో ఆధ్యాత్మిక వాతావరణంలో ఉంటున్న స్వామిపై ఇటువంటి దాడి జరగడం విచారకరమన్నారు.

మలేరియా నివారణకు చర్యలు

భువనేశ్వర్: మలేరియా, డెంగీ వ్యాప్తి చెందకుండా భువనేశ్వర్ నగర పాలక సంస్థ (బీఎంసీ) ముమ్మరంగా చర్యలు చేపడుతోంది. నగర వ్యాప్తంగా దోమల సంతతి వృద్ధి చెందుతున్న ప్రాంతాలను గుర్తించింది. ఆయా ప్రాంతాల్లో దోమల సంతతి నివారణతో మలేరియా, డెంగీ రోగాల వ్యాప్తికి కళ్లెం వేయడానికి నగరంలోని 4 ప్రధాన కాలువల్లో పశ్చిమ గంబూషియా చేపలను వదిలింది. దోమల వృద్ధికి హాని కలిగించే 175 ప్రదేశాలను బీఎంసీ హెల్త్ ఇన్‌స్పెక్టర్లు గుర్తించారు. ఈ పరిసరాల్లో నీటి వనరుల్లో గంబూసియా చేపలను వదలాలని బీఎంసీ నిర్ణయించింది. దోమల ఫిష్ అని కూడా పిలువబడే గంబూసియా చేపలు దోమల లార్వాలను తింటాయి. తద్వారా వాటి సంతానోత్పత్తి ప్రక్రియను నిరోధించి మలేరియా మరియు డెంగీ వంటి వెక్టర్ ద్వారా సంక్రమించే వ్యాధుల నివారణకు కారణమవుతాయని నగర పాలక సంస్థ ఆరోగ్య శాఖ వర్గాలు భావన. పాత బీఎంసీ కార్యాలయం వెనుక 55వ నంబర్ వార్డు పరిధి డ్రెయిన్‌లో దోమల చేపలను వదిలారు. దీంతో పాటు స్థానిక సాహిద్ నగర్ మహర్షి కళాశాల వెనుక ఉన్న మురుగు కాలువ, మంచేశ్వర్ పోలీస్‌స్టేషన్ ఎదురుగా ఉన్న డ్రెయిన్, నగర శివారులోని పటియా నందన్ విహార్‌లో ఉన్న కాలువలో భువనేశ్వర్ నగర పాలక సంస్థ అధికారులు గంబూసియా చేప పిల్లలను వదిలారు.

యువకుడి దారుణ హత్య



రక్తపు మడుగులో బినయ్ పాలో మృతదేహం

రాయగడ: జిల్లాలోని చందిలి పోలీసుస్టేషన్ పరిధి సాయిప్రియనగర్ పదో లైన్‌లో ఒక యువకుడు దారుణ హత్యకు గురయ్యాడు. బుధవారం అర్ధరాత్రి చోటుచేసుకున్న ఈ ఘటనలో మృతుడు స్థానిక తుంబిగుడ ప్రాంతంలో నివసిస్తున్న బినయ్ పాలో (32)గా గుర్తించారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ఆస్పత్రికి తరలించారు. వివరాల్లోకి వెళ్తే.. జిల్లాలోని గుణుపూర్ సబ్ డివిజన్‌లో గల భీమాపూర్ గ్రామానికి చెందిన పాలో కొద్ది నెలల క్రితం రాయగడకు ఉపాధి కోసం వచ్చాడు. స్థానిక తుంబిగుడలో ఒక అద్దె ఇంట్లో తన భార్య, ఇద్దరు పిల్లలతో నివాసముంటున్నాడు. సమీపంలోని ఎఫ్‌సీఐ కూడలి వద్ద నున్న ఎంజీ దాబాలో పనిచేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈ క్రమంలో ఎప్పటిలాగే బుధవారం దాబాలో పనులు ముగించుకుని ఇంటికి వెళ్లాడు. కానీ అతను ఇంటికి రాకపోవడంతో భార్య కుటుంబ సభ్యులకు సమాచారం అందించింది. ఈ నేపథ్యంలో వారంతా ఆ రోజు రాత్రి అన్ని ప్రాంతాల్లో వెతకడం ప్రారంభించారు. ఈ నేపథ్యంలో స్థానిక సాయిప్రియ నగర్ పదో లైన్‌లో శవమై కనిపించాడు. వెంటనే పోలీసులకు సమాచారం అందించడంతో సంఘటన స్థలానికి చేరుకున్నారు. తలకు పెద్ద గాయంతో రక్తపు మడుగులో పడివున్న పాలో మృతదేహాన్ని చూసిన ఆయన భార్య, కుటుంబీకులు ఎవరో హత్య చేసి ఉంటారని అనుమానిస్తున్నారు. పోలీసులు ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఐదుగురు విద్యార్థులు మిస్సింగ్

- తీసుకెళ్లిన కర్ణాటక నార్కొటిక్ బ్యూరో
- విద్యార్థులకు గంజాయి మాఫియాతో సంబంధాలు



జయపురం పోలీసుస్టేషన్

జయపురం: పట్టణంలోని ఐదుగురు విద్యార్థులను కర్ణాటక నార్కొటిక్ బ్యూరో టీమ్ తీసుకెళ్లినట్లు పట్టణ పోలీసు అధికారి సత్యానంద పాత్రో గురువారం తెలియజేశారు. విద్యార్థుల్లో ఒకరు ఎన్నికై న పంచాయతీ ప్రతినిధి అయినటువంటి స్థానిక ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థి. మిగతావారు స్థానిక స్వయం పాలిత విక్రమదేవ్ కళాశాల విద్యార్థులు అని తెలిసింది.

సెల్‌ఫోన్లు స్విచ్ఛాఫ్

ఈనెల 13వ తేదీ రాత్రి నుంచి విద్యార్థుల సెల్‌ఫోన్లు స్విచ్ ఆఫ్ వస్తుండడంతో తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేశారు. తల్లిదండ్రుల వివరణ ప్రకారం పట్టణంలోని పరిసర ప్రాంతాల్లో గల విద్యార్థులు పారాబెడలో ఒక వీధిలో కలిసి చదువుకుంటున్నారు. 13వ తేదీ రాత్రి వారంతా ఆ ఇంటిలో ఉన్నారు. అయితే ఆరోజు రాత్రి 10 గంటల సమయంలో రెండు కారుల్లో కొంతమంది వచ్చి, తాము నార్కొటిక్ టీమ్ అని తమతో రావాలని చెప్పారు. దీంతో విద్యార్థులు ఎందుకు రావాలని ప్రశ్నించగా ఒక వ్యక్తి తుపాకీతో విద్యార్థిని కొట్టడంతో రక్తం వచ్చినట్లు తెలిపారు. అనంతరం వారిని అక్కడి నుంచి తీసుకెళ్లారని, అప్పటి నుంచి విద్యార్థుల సెల్‌ఫోన్లు స్విచ్ ఆఫ్ అయ్యాయని పేర్కొన్నారు. మంగళవారం సైతం ఫోన్లు రింగ్ అవ్వకపోవడంతో విద్యార్థులు ఉండే ఇంటికి వెళ్లి చూడగా అక్కడ ఎవరూ లేరన్నారు. దీంతో ఆ ప్రాంతంలో ఉన్నవారిని విచారించినట్లు ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం తమ పిల్లలు కనిపించడం లేదని పట్టణ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.

ఇదీ విషయం

అయితే అరెస్టైన విద్యార్థులకు గంజాయి మాఫియాతో సంబంధాలు ఉన్నాయని, అందువలనే కర్ణాటక నార్కొటిక్ టీమ్ తీసుకెళ్లినట్లు తెలుస్తోంది. కొత్తవీధి 4వ లైన్‌కు చెందిన హిమాంశు శేఖర నాయిక్(20), పాయిక సాహి రాజా మండల్(22), నొడియబెడ వీధి కె.అమరనాథ్(19), పారాబెడకు చెందిన దత్(19), నవరంగపూర్ జిల్లా ఉమ్మరకోట్‌కి చెందిన సోహమ్(20)లను నార్కొటిక్ టీమ్ అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు పేర్కొంటున్నారు. నిందిత విద్యార్థులు గతంలో పలుమార్లు గంజాయి రవాణా చేశారని, వారిపై కర్ణాటకలో కేసులు నమోదయ్యాయని వెల్లడించారు. ఈ విషయంలో కర్ణాటక నార్కొటిక్ బ్యూరో వలపన్ని వారిని పట్టుకుంది. గంజాయి కావాలని ఫోను చేసి మాట్లాడగా, మీరు జయపురం వస్తే గంజాయి లభిస్తుందని వారు హామీ ఇచ్చారు. దీంతో ఈనెల 13వ తేదీన రెండు కారులలో పది మందికిపైగా కర్ణాటక నార్కొటిక్ క్రైమ్ బ్యూరో అధికారులు, సిబ్బంది జయపురం వచ్చి పారాబెడ ఝుంకరదేవి మందిరం వెనుకన ఉన్న వీధిలో విద్యార్థులు అద్దెకు ఉంటున్న ఇంటిపై దాడి జరిపారు. అనంతరం విద్యార్థులను పట్టుకొని తమతో తీసుకుని వెళ్లారని వెల్లడించారు. 14వ తేదీన విద్యార్థుల బంధువులు స్టేషన్‌కు వచ్చి తమ బిడ్డలు కనిపించడం లేదని ఫిర్యాదు చేశారని, వెంటనే పోలీసులు ఆ ఇంటికి వెళ్లి శోధించగా ఇంటిలో ఖాళీ మద్యం సీసాలు, గంజాయి, బీడీలు మొదలగు మత్తు పదార్థాలు లభ్యమయ్యాయని వెల్లడించారు. జయపురం సబ్ డివిజన్ పోలీసు అధికారి హరిష్ బి.సి ఆదేశం మేరకు ఆ ప్రాంతంలో దర్యాప్తు జరపగా కర్ణాటక నార్కొటిక్ క్రైమ్ బ్యూరో వారిని తీసుకు వెళ్లినట్లు నిర్ధారణకు వచ్చినట్లు వెల్లడించారు.



పోలీసు అధికారులతో విద్యార్థుల బంధువులు

మావో బ్యానర్లు కలకలం



కూంబింగ్ నిర్వహిస్తున్న పోలీసులు

బరంపురం: ప్రశాంతతకు మారుపేరైన కొందమాల్ జిల్లాలో గురువారం ఉదయం మావోయిస్టుల ప్రచార బ్యానర్లు కలకలం రేపాయి. జిల్లాలోని కుర్మగడా ప్రాంతంలో ఒక దుకాణం, చెట్టుపై మావో బ్యానర్లు దర్శనమివ్వడంతో అలజడి రేగింది. సమాచారం అందుకున్న బల్లిగుడా పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని బ్యానర్లు స్వాధీనం చేసుకున్నారు. దీంతో ఒక్కసారిగా అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. ఎర్రని గుడ్డపై తెలుపు రంగుతో విప్లవ సంస్కృతిని మరియు 51 విప్లవ పండగలు అందరూ పాటించి పాలించాలని చెబుతూ మావో బ్యానర్లు దర్శనమిస్తున్నాయి. దీనిపై కొందమాల్ జిల్లా భమ్మునిగాం పోలీసుస్టేషన్ ఐఐసీ అధికారి బాబా శంకర్ సారంగి మాట్లాడుతూ.. కొందమాల్-కలహండి జిల్లాల సరిహద్దులోని కూర్మగడా గ్రామ శివారు బస్టాండ్ వద్ద బ్యానర్లు, పోస్టర్లు స్వాధీనం చేసుకున్నామని తెలియజేశారు. దీంతో గంజాం, గజపతి, కొందమాల్, కలహండి ప్రాంతాలకు వచ్చిపోయే వాహనాలను ముమ్మరంగా తనిఖీ చేస్తున్నామన్నారు. భారీ స్థాయిలో కూంబింగ్ నిర్వహిస్తున్నట్లు కొందమాల్ ఏఎస్పీ సురేంద్ర కుమార్ పాత్రో వెల్లడించారు.



గ్రామ శివారులోని చెట్టుకు కట్టిన బ్యానర్లు

క్లుప్తంగా

మహా రుద్రయాగం



లింగార్చన చేస్తున్న దృశ్యం

రాయగడ: కార్తీక మాస పర్వదినాలు సందర్భంగా మహా శివునికి ప్రీతికరమైన రుద్రాభిషేక సహిత మహారుద్ర యాగం కన్నుల పండువగా ప్రారంభమయ్యింది. స్థానిక న్యూకాలనీలోని రామలింగేశ్వర ఆలయ ప్రాంగణంలో గురువారం జరిగిన కార్యక్రమంలో భాగంగా మండప శుద్ధి, పుణ్యాహవచనం, కలశ స్థాపన, మండపారాధన నిర్వహించారు. అనంతరం పంచ లోహాలతో రూపొందించిన 141 శివలింగాలను లింగాకృతిగా అమర్చి నమక, చమక సహిత రుద్రాభిషేకం నిర్వహించారు. అనంతరం లలితా దేవికి సహస్ర నామ కుంకుమార్చన, రుద్రయాగం జరిగింది. పి.గణపతి శాస్త్రి విప్రబృందం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమాల్లో ఉత్కళాంధ్ర బ్రాహ్మణ సేవా సమాజం కార్యదర్శి భళ్లమూడి నాగరాజు దంపతులు, భక్తులు పాల్గొన్నారు. మరో పదిహేను రోజుల పాటు ఈ కార్యక్రమాలు జరగనున్నట్లు నిర్వాహకులు తెలియజేశారు.

క్యాజూ మార్కెటింగ్ పుస్తకావిష్కరణ

టెక్కలి: టెక్కలి ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన ఎంబీఏ ప్రొఫెసర్ కె.వేణుగోపాల్, గరుడభద్ర మహేంద్రా క్యాజూ ఇండస్ట్రీ ఎండీ కె.సందీప్‌లు సంయుక్తంగా రచించిన 'క్యాజూ మార్కెటింగ్' పుస్తకాన్ని గురువారం కళాశాల డైరెక్టర్ వి.వి.నాగేశ్వరరావు ఆవిష్కరించారు. పలాస జీడి ఉత్పత్తులను అంతర్జాతీయ స్థాయిలో విక్రయించేందుకు గల అవకాశాలపై ఈ పుస్తకంలో తెలియజేసినట్లు ఆయన పేర్కొన్నారు. జీడి పరిశ్రమలకు చెందిన ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు పుస్తకం ఎంతగానో ఉపయోగపడుతుందని చెప్పారు.

అంగన్‌వాడీ కార్యకర్తలకు ఇంగ్లిష్ శిక్షణ

కోటబొమ్మాళి: జిల్లా వ్యాప్తంగా అంగన్‌వాడీ కార్యకర్తలకు ఇంగ్లిష్ భాషపై ఆన్‌లైన్‌లో శిక్షణ ఇవ్వనున్నట్లు ఐసీడీఎస్ పీడీ బగాది శాంతిశ్రీ తెలిపారు. గురువారం కోటబొమ్మాళి ఐసీడీఎస్ కార్యాలయంలో కోటబొమ్మాళి, సంతబొమ్మాళి మండలాల అంగన్‌వాడీ కార్యకర్తలు, సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రానున్న రోజుల్లో పిల్లలకు విద్యా బోధన ఇంగ్లిష్‌తో ముడిపడి ఉన్నందున ప్రతి కార్యకర్త భాషపై పట్టు సాధించాలన్నారు. శిక్షణకు సంబంధించి ఐసీడీఎస్ కార్యాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పీఓ చింతాడ హైమావతి, ఏసీడీపీఓ రూపలత, సూపర్‌వైజర్లు సత్యప్రియ, పద్మలత, మనోహరి, ఉషశ్రీ, పద్మావతి, రమాకుమారి పాల్గొన్నారు.

జాతీయ తైక్వాండో పోటీలకు ఇచ్ఛాపురం విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

ఇచ్ఛాపురం: మండల కేంద్రంలోని ఇచ్ఛాపురం ప్రభుత్వోన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు ఇటీవల కడపలో జరిగిన 67వ ఎస్జీఎఫ్ రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీల్లో రాణించి బంగారు, రజత పతకాలను కైవసం చేసుకొని జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించారని హెచ్‌ఎం ఎన్.విశ్వనాథం తెలిపారు. ఈ సందర్భంగా ఆశి రేవంత్(స్వర్ణం), సీహెచ్ గిరి(స్వర్ణం), ఎస్.జయరామ్(రజతం)లను గురువారం అభినందించారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు టి.గణేష్, శారద, ఉపాధ్యాయులు జోగేశ్వరరావు, సూర్యం, చంద్రశేఖర్, తైక్వాండో కోచ్ దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

పత్రికా విలువలు పెంచుదాం

- ఘనంగా జాతీయ పత్రికా దినోత్సవం



రాయగడ: కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి సరక తదితరులు

బరంపురం: ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చి పత్రికలు విలువలు పెంచుదామని సీనియర్ జర్నలిస్టులు పిలుపునిచ్చారు. గంజాం జిల్లా పాలన యంత్రాంగం సహకారంతో జిల్లా ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో జర్నలిస్టులు జాతీయ పత్రికా దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ జర్నలిస్ట్ జగన్‌మోహన్ మహాపాత్రో మాట్లాడుతూ ప్రతికల్లో వచ్చే వార్తలపై ప్రజల్లో ఉన్న నమ్మకాన్ని కాపాడుకోవాలని సూచించారు. ప్రస్తుతం ఈవెంట్ వార్తల వెనుక పరుగులు తీస్తూ, ప్రజా సమస్యలపై పరిశోధనాత్మక వార్తలు తగ్గుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. జర్నలిస్టులు ప్రజా సమస్యలపై పరిశోధనాత్మక వార్తలు ప్రచురించేందుకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ప్రింట్ మీడియా, ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులు పాల్గొన్నారు.

బరంపురం విశ్వ విద్యాలయంలో...

బరంపురం విశ్వ విద్యాలయంలో జర్నలిజం అండ్ మాస్ కమ్యునికేషన్ విభాగం ఆధ్వర్యంలో జాతీయ పత్రిక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వీసీ గీతాంజలి దాస్ హాజరై విద్యార్థులను ఉత్సాహపరిచారు. అలాగే హిల్‌పట్నా రోడ్‌లోని ఎస్‌ఎంఐటీలో సైతం వేడుకలు నిర్వహించారు.

పర్లాకిమిడి: స్థానిక జిల్లా పరిషత్ కాన్ఫరెన్స్ హాల్‌లో జాతీయ పత్రికా దినోత్సవాన్ని నిర్వహించారు. కలెక్టర్ స్మృతి రంజన్ ప్రధాన్ ముఖ్య అతిథిగా విచ్చేయగా జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యనిర్వహణ అధికారి గుణనిధి నాయక్, రాష్ట్ర జర్నలిస్టుల సంఘం కార్యవర్గ సభ్యుడు గరుడ ధ్వజ చౌదరి, ప్రెస్ క్లబ్ కన్వీనర్ ద్విజేంద్ర నాథ్ పాఢిలు ముఖ్య వక్తలుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మీడియా రంగంలో కృత్రిమ మేధ అనే అంశంపై చర్చించారు. కలెక్టర్ స్మృతి రంజన్ ప్రధాన్ మాట్లాడుతూ.. గజపతి జిల్లాలో ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా పటిష్టంగా పనిచేస్తోందని పేర్కొన్నారు. 5టీ పనులు, మిషన్ శక్తి, స్వయం సహాయక గ్రూపులపై చక్కగా వార్తలు ప్రచురిస్తున్నారని వెల్లడించారు. జిల్లాలోని పనిచేస్తున్న విలేకరులకు ప్రభుత్వం తరపున సహకారం అందిస్తామన్నారు. ఇటీవల మృతి చెందిన కాశీనగర్ ఒడియా పత్రికా విలేకరి సత్యన్నారాయణ చౌదరి భార్యకు ప్రభుత్వం తరపున రూ.4 లక్షల చెక్కుల అందజేశారు. అలాగే వక్తృత్వ పోటీల్లో విజేతలకు మెమొంటోలు, సర్టిఫికెట్లను అందజేశారు. డీపీఆర్వో ప్రదిప్త గురుమయి అతిథులకు ధన్యవాదాలు తెలిపారు.

జయపురం: సబ్ డివిజన్ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో జాతీయ పత్రికా దినోత్సవాన్ని నిర్వహించారు. ఒడిశా జర్నలిస్టు యూనియన్ తరపున బొరిగుమ్మలో జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న రాష్ట్ర ఒడిశా జర్నలిస్టు యూనియన్ సాధారణ కార్యదర్శి కొయ్య శ్రీనివాసరావు మాట్లాడుతూ.. సమాజంపై జర్నలిస్టుల బాధ్యతలను వివరించారు. అలాగనే జర్నలిస్టులపై పలు ప్రాంతాల్లో జరుగుతున్న దాడులను ఖండించారు. కార్యక్రమంలో ఒడిశా జర్నలిస్టు యూనియన్ కార్యదర్శి హరీష్ కుమార్ పట్నాయక్, ఉపాధ్యక్షుడు రబిశంకర మహాపాత్రో తదితరులు పాల్గొన్నారు.



మల్కన్‌గిరి: సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ విశాల్ సింగ్ తదితరులు

రాయగడ: స్థానిక సాంస్కృతిక కార్యాలయ భవనంలో జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో జాతీయ పత్రికా దినోత్సవాన్ని గురువారం నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఆదివాసీ, హరిజన సంక్షేమ శాఖ మంత్రి జగన్నాథ సరక, రాయగడ ఎమ్మెల్యే మకరంద ముదులి, రాయగడ సబ్ కలెక్టర్ కల్యాణి సంఘమిత్ర దేవి, జిల్లా అదనపు మేజిస్ట్రేట్ రామేశ్వర్ ప్రధాన్, అదనపు కలెక్టర్ భాస్కర్ రైతా, జిల్లా పౌరసంబంధాల శాఖ అధికారి బసంత కుమార్ ప్రధాన్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి సరక మాట్లాడుతూ పత్రికలు దేశ సంక్షేమానికి నిలువుటద్దాలన్నారు. కార్యక్రమంలో పాత్రికేయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మల్కన్‌గిరి: స్థానిక జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో కలెక్టర్ సమక్షంలో జాతీయ పత్రికా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ విశాల్ సింగ్ మాట్లాడుతూ అనునిత్యం ప్రజల కోసం పాత్రికేయులు పనిచేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సబ్ కలెక్టర్ అక్షయ్ ఖేముండు, డీపీఆర్వో ప్రమిళ మార్ఝి తదితరులు పాల్గొన్నారు.



జయపురం: బొరిగుమ్మలో పత్రికా దినోత్సవంలో పాల్గొన్న జర్నలిస్టులు



బరంపురం: వేదికపై సీనియర్ జర్నలిస్ట్ జగన్‌మోహన్ మహాపాత్రో తదితరులు



పర్లాకిమిడి: మాట్లాడుతున్న కలెక్టర్ స్మృతి రంజన్ ప్రధాన్



పర్లాకిమిడి: కాశీనగర్ విలేకరి సత్యన్నారాయణ చౌదరి భార్యకు చెక్కు అందజేస్తున్న దృశ్యం



బరంపురం: పత్రికా దినోత్సవంలో పాల్గొన్న జర్నలిస్టులు

అయ్యప్ప స్వామి ఊరేగింపు



ఊరేగింపులో పాల్గొన్న అయ్యప్ప భక్తులు

రాయగడ:

అయ్యప్ప స్వామి దీక్షలతో పట్టణంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. దీనిలో భాగంగా భక్తులు అయ్యప్ప స్వామి ఉత్సవమూర్తిని పట్టణంలో గురువారం ఊరేగించారు. భక్తులు స్వామివారి నామస్మరణతో ఊరేగింపులో పాల్గొన్నారు. స్థానిక గౌతం నగర్‌లోని అయ్యప్ప మందిరం నుంచి ప్రారంభమైన ఊరేగింపు పురవీధుల మీదుగా వెళ్లి జంఝావతి నది వరకు కొనసాగింది. అక్కడ నియమ నిబంధనల మేరకు అయ్యప్ప ఉత్సవ విగ్రహానికి స్నానమాచరించి ప్రత్యేక పూజలను నిర్వహించి తిరిగి మందిరానికి తీసుకొచ్చారు. దీనినే అయ్యప్ప ఆరాటోత్సవంగా భక్తులు పిలుస్తుంటారు.



ఉత్సవ విగ్రహ తిరువీధి నిర్వహిస్తున్న దృశ్యం

దాతలే దిక్కు..!



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న గోవిందరావు

జలుమూరు: తన కుమారుడిని రక్షించి ఆదుకోవాలని జలుమూరు మండలం యలమంచిలి గ్రామానికి చెందిన చెంచల లక్ష్మి దాతలను వేడుకుంటోంది. ఈమె కుమారుడు గోవిందరావు డిగ్రీ మొదటి ఏడాది చదువుతుండగా అనారోగ్యానికి గురయ్యాడు. విశాఖలో ఆస్పత్రికి వెళ్లి చూపించగా కిడ్నీలు దెబ్బతిన్నట్లు వైద్యులు ధ్రువీకరించారు. ప్రస్తుతం విశాఖపట్నంలోనే డయాలసిస్ చేయిస్తున్నారు. కిడ్నీ మార్పిడి జరిగితే బిడ్డ బతుకుతాడని డాక్టర్లు చెప్పడంతో తన కిడ్నీ ఇచ్చేందుకు సిద్ధమయ్యానని, అయితే కిడ్నీ మార్చేందుకు సుమారు రూ.15 లక్షలు ఖర్చు అవుతుందని తల్లి వాపోయింది. తన భర్త రమణమూర్తి మరణించారని, కూలి పనులు చేసుకుని జీవనం సాగిస్తున్నానని, అంత సొమ్ము సమకూర్చలేనని, దాతలే ముందుకు వచ్చి పుత్రభిక్ష పెట్టాలని వేడుకుంటోంది. ఇప్పటికే గ్రామానికి చెందిన పెద్దలు, యువత, కొందరు ప్రజాప్రతినిధులు, దాతలు ముందుకు వచ్చి సుమారు రూ.1.50 లక్షలు అందించారని, సహాయం చేయదలచిన వారు 9963529769 నంబరుకు ఫోన్‌పే చేయాలని విన్నవించారు.

దొంగలున్నారు జాగ్రత్త..!

శ్రీకాకుళం క్రైమ్: జిల్లాలో వివిధ నేర కార్యకలాపాల్లో ఉన్న కరుడుగట్టిన నేరస్తులు, క్రిమినల్ గ్యాంగుల్లో ఉన్న వ్యక్తుల పేర్లు, ముఖచిత్రాలతో కూడిన పోస్టర్లను, ఫ్లెక్సీలను గురువారం శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్సులో పోలీసులు ఏర్పాటు చేశారు.

ఇందులో ఉన్న వ్యక్తులు అనుమానాస్పదంగా తిరిగితే వెంటనే పోలీసులకు తెలియజేయాలని జిల్లా సెంట్రల్ క్రైమ్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ వి.బాబూజీ రావు కోరారు. సీసీఎస్ సీఐ 6309990835, అదనపు ఎస్పీ (క్రైమ్) టి.పి.విఠలేశ్వరరావు 6309990893 నంబర్లకు తెలియజేసి నేరనియంత్రణకు సహకరించాలన్నారు.



ఆర్టీసీ కాంప్లెక్సు ఆవరణలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

బాల్య వివాహాలను నిర్మూలిద్దాం

శ్రీకాకుళం అర్బన్: బాల్య వివాహాలు జరగకుండా అంగన్‌వాడీ సిబ్బందితో పాటు ప్రతిఒక్కరూ కృషి చేయాలని ఐసీడీఎస్ శ్రీకాకుళం అర్బన్ ప్రాజెక్టు సీడీపీవో ఎ.శోభారాణి అన్నారు. ప్రాజెక్ట్ కార్యాలయంలో గురువారం అంతర్జాతీయ దత్తత మాసోత్సవాలు, బేటీ బచావో బేటీ పడావోలో భాగంగా బాల్య వివాహాల నిర్మూలన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల్య వివాహాల వల్ల జీవితం నాశనమవుతుందన్నారు. ఎక్కడైనా బాల్య వివాహాలు జరిగినట్లయితే వెంటనే పోలీసులకు తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో బాలల రక్షణ అధికారులు ఇప్పిలి లక్ష్మీనాయుడు, మెట్ట మల్లేశ్వరరావు, ఓఆర్‌డబ్ల్యూ ఎ.గీత, చైల్డ్ హెల్ప్‌లైన్ కేస్ వర్కర్ డి.రాజు, సూపర్‌వైజర్లు యశోద, ఉమ, సీతామహాలక్ష్మి, మహిళా సంరక్షణ కార్యదర్శులు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

'పూర్వ వైభవం తీసుకురావాలి'

జయపురం: కొరాపుట్ జిల్లా జయపురంలోని చారిత్రాత్మక జగన్నాథ్ సాగర్‌కు పూర్వ వైభవం తీసుకురావాలని జగన్నాథ్ సాగర్ అభివృద్ధి ట్రస్టు డిమాండ్ చేసింది. ఈ మేరకు ట్రస్టు కార్యకర్తలు సబ్ కలెక్టర్‌కు గురువారం ఒక వినతిపత్రం అందజేశారు. ప్రజలు అపూర్వంగా చూసే చారిత్రాత్మక జగన్నాథ్ సాగర్ 300 ఎకరాల వైశాల్యం ఉండేదని, ప్రస్తుతం పలు కారణాల వలన కుంచించుకుపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. సాగర్ ప్రాంతంలో ఉన్న మత్స్య విభాగం, మైనర్ ఇరిగేషన్ విభాగం, పర్యాటక శాఖ, మున్సిపాలిటీ విభాగాల్లో ప్రాంతాలను ఒకే విభాగం కిందకు తీసుకొచ్చి జగన్నాథ సాగర్‌కు పూర్తిస్థాయి వైభవం కల్పించాలన్నారు. జగన్నాథ్ సాగర్ చుట్టూ నిరుపేద కుటుంబాలు ఉన్నాయని, వారిని ఖాళీ చేయించి పునరావాసం కల్పించి ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. అలాగే సాగర్ స్థలాలను కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జగన్నాథ్ సాగర్ అభివృద్ధి ట్రస్టు ప్రతినిధులు బరిగెడ చంద్రశేఖరరావు, నిరంజన్ పాణిగ్రాహి, రఘుదాస్ త్రిపాఠి, సతీష్‌నంద దావా తదితరులు పాల్గొన్నారు.



సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసిన ట్రస్టు సభ్యులు



చారిత్రాత్మక జగన్నాథ్ సాగర్

గిరి రైతుకు ప్రోత్సాహం



పవర్ టిల్లర్ యంత్రం

- రాయితీపై యంత్ర పరికరాల పంపిణీ
- రూ.2.11 కోట్లతో ఐదు రకాల యంత్రాలు సిద్ధం
- ఐటీడీఏ పరిధిలో 16 మండలాల్లో గిరిజన రైతుల గుర్తింపు

టెక్కలి: వ్యవసాయానికి పెద్దపీట వేస్తున్న జగనన్న సర్కారు గిరి రైతులను ప్రోత్సహించేందుకు మరో ముందడుగు వేసింది. మారుమూల గిరిజన ప్రాంతాల్లో రైతులకు చేయూతగా నిలిచి మరింత ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోంది. ఇందులో భాగంగా గిరిజన రైతులకు సబ్సిడీపై యంత్ర పరికరాలు అందజేసేందుకు ఏర్పాట్లు చేస్తోంది. వ్యవసాయంతో పాటు ఉద్యానవన పంటలు సాగును ప్రోత్సహించాలన్న ఉద్దేశంతో గరిష్టంగా 90 శాతం రాయితీతో 5 రకాల యంత్ర పరికరాలు అందజేసేందుకు ఇప్పటికే రైతుల గుర్తింపు ప్రక్రియను ప్రారంభించింది. జిల్లా వ్యాప్తంగా ఐటీడీఏ పరిధిలో 16 మండలాల్లో గిరిజన రైతులకు వీటిని అందజేయనున్నారు. సుమారు రూ.2,11,88,000 విలువైన యంత్ర పరికరాలను సబ్సిడీపై అందించనున్నారు. సీతంపేట ఐటీడీఏ పరిధిలోని బూర్జ, హిరమండలం, కొత్తూరు, సరుబుజ్జిలి, పాతపట్నం, జలుమూరు, కంచిలి, ఎల్.ఎన్.పేట, లావేరు, మందస, మెళియాపుట్టి, టెక్కలి, నందిగాం, పలాస, సారవకోట, సోంపేట తదితర మండలాల్లో గిరిజన రైతులకు ఈ యంత్ర పరికరాలను అందజేస్తారు.

యంత్రం	పరికరాల సంఖ్య	రాయితీ
పవర్ వీడర్లు	25	90 శాతం
పవర్ టిల్లర్స్	23	90 శాతం
డీజిల్, పెట్రోల్ ఇంజిన్లు	62	80 శాతం
మినీ ట్రాక్టర్లు	20	60 శాతం
మల్టీ క్రాప్ త్రీషర్స్	10	75 శాతం

సద్వినియోగం చేసుకోవాలి..



వ్యవసాయం, ఉద్యానవన పంటలను సాగు చేస్తున్న గిరిజన రైతులను మరింత ప్రోత్సహించేందుకు ప్రభుత్వం యంత్రాలను రాయితీపై అందజేస్తోంది. గరిష్టంగా 90 శాతం రాయితీతో యంత్రాలు పంపిణీ చేయనున్నారు. జిల్లాలో సుమారు 16 మండలాల్లో గిరిజన రైతులకు లబ్ధి చేకూరనుంది.

– బి.వి.తిరుమలరావు, వ్యవసాయ శాఖ ఏడీ, టెక్కలి

క్లుప్తంగా

39 మద్యం బాటిల్స్ పట్టివేత



పట్టుకున్న మద్యం బాటిల్స్‌తో ఎస్సై

బలిజిపేట: మద్యం సీసాలను అక్రమంగా తరలిస్తున్న వ్యక్తిని పట్టుకుని 39బాటిల్స్‌ను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై ప్రశాంత్‌కుమార్ గురువారం తెలిపారు. ఈ మేరకు ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. బలిజిపేట శివాలయం వద్ద మాటువేసి వాహనాలను తనిఖీ చేస్తుండగా కింజంగి గ్రామానికి చెందిన ఆర్.జగదీశ్వరరావు మద్యం సీసాలతో పట్టుబడ్డాడు. బలిజిపేటలో మద్యం సీసాలను కొనుగోలు చేసి గోనెసంచిలో తరలిస్తున్నట్లు అందిన సమాచారం మేరకు తనిఖీ చేసి పట్టుకున్నట్లు ఎస్సై చెప్పారు.

108లో ప్రసవం


108 వాహనంలో మగబిడ్డకు జన్మనిచ్చిన గిరిజన మహిళ భవాని

కురుపాం: మండలంలోని పొడి పంచాయతీ సంతోషపురం గ్రామానికి చెందిన గిరిజన మహిళ కె.భవాని 108 వాహనంలో గురువారం ప్రసవించి పండంటి మగబిడ్డకు జన్మనిచ్చింది. వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన భవాని తీవ్ర పురిటినొప్పులతో బాధపడుతుండగా కుటుంబసభ్యులు, గ్రామస్తులు, 108కు సమాచారం అందించారు. దీంతో వెంటనే గ్రామానికి చేరుకున్న వాహనం గర్భిణిని మండల కేంద్రంలోని సామాజిక ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో నొప్పులు తీవ్రం కావడంతో ఈఎంటీ వీఏ.నాయుడు, పైలెట్ జి.జోగేశ్వరరావు ప్రథమ చికిత్స అందించారు. కడుపులో ఉన్న బిడ్డ మెడకు పేగులు చుట్టుకుని ఉండడంతో చాకచక్యంగా చికిత్స అందించి డెలివరీ చేశారు. ప్రస్తుతం తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నారని, ఆమెకు ఇది రెండో కాన్పు అని, కురుపాం సామాజిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స పొందుతున్నారని 108 సిబ్బంది వివరించారు.

పోక్సో కేసులో ముద్దాయికి 20 ఏళ్లు జైలు, జరిమానా

విజయనగరం క్రైమ్: పోక్సో కేసులో నేరం రుజువు కావడంతో ముద్దాయికి 20 ఏళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.5వేల జరిమానా విధిస్తూ కోర్టు తీర్పునిచ్చినట్లు ఎస్పీ ఎం.దీపిక గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రేమపేరుతో అసభ్యకరంగా ప్రవర్తించి, బెదిరించి బాలికను వంచించి లైంగికదాడికి పాల్పడిన గరివిడిలోని ఫేకర్ క్వార్టర్స్‌కు చెందిన కాకర్లపూడి రామ్‌కుమార్ వర్మపై బాధితురాలి ఫిర్యాదు మేరకు చీపురుపల్లి పోలీస్ స్టేషన్‌లో పోక్సో కేసును 2018లో అప్పటి ఎస్సై టి.క్రాంతికుమార్ నమోదుచేశారు. బొబ్బిలి డీఎస్పీ పి.సౌమ్యలత, గౌతమీషాలీ సకాలంలో దర్యాప్తు పూర్తి చేసి, నిందితుడ్ని అరెస్టు చేసి, న్యాయస్థానంలో అభియోగపత్రం దాఖలు చేశారు. పోలీసుల తరఫున స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ మావూరి శంకరరావు వాదనలు వినిపించగా, చీపురుపల్లి ఎస్సై ఎ.సన్యాసినాయుడు, కోర్టు హెచ్‌సీ వేణునాయుడు, రైటర్ వెంకటరమణ, కానిస్టేబుల్ వెంకటరావులు సాక్షులను సకాలంలో కోర్టులో హాజరపరిచి బాధ్యతాయుతంగా వ్యవహరించారంటూ వారందరినీ అభినందించారు.

సివిల్ సర్వీసెస్ ప్రోత్సాహక పథకానికి దరఖాస్తుల స్వీకరణ

విజయనగరం అర్బన్: సామాజికంగా, విద్యాపరంగా, ఆర్థికంగా వెనుకబడిన, బలహీన వర్గాల అభ్యర్థులను సివిల్ సర్వీసెస్ పోటీ పరీక్షల్లో ప్రోత్సహించడం కోసం ప్రభుత్వం కొత్తగా ప్రవేశ పెట్టిన 'జగనన్న సివిల్ సర్వీసెస్ ప్రోత్సాహకం' పథకం కోసం అర్హుల నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులను స్వీకరిస్తున్నామని జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ, సాధికారత అధికారి సందీప్ కుమార్ తెలిపారు. యూపీఎస్సీ నిర్వహించే ఈ పరీక్షలో ప్రిలిమ్స్, మెయిన్స్‌లో అర్హత సాధించిన వారికి ఆర్థిక సహాయం అందిస్తారని తెలిపారు. తొలుత ప్రిలిమినరీ పరీక్షలో అర్హత సాధించిన వారికి రూ.లక్ష, మెయిన్స్‌లో అర్హత సాధించిన వారికి రూ.50 వేల ప్రోత్సాహకం అందిస్తారని పేర్కొన్నారు. 2023లో నిర్వహించిన ప్రిలిమినరీ పరీక్షలో ఇప్పటికే అర్హత పొందిన వారు దరఖాస్తు చేసుకోవాలని ఆహ్వానించారు. అభ్యర్థి కుటుంబ వార్షికాదాయం రూ.8 లక్షలకు మించరాదన్నారు. అభ్యర్థులు 'జ్ఞానభూమి.జీఓవీ.ఐఎన్' వెబ్‌సైట్‌లో పోర్టల్‌లో సూచించిన వెబ్‌లింక్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

కులగణనకు కసరత్తు

- జిల్లాలో 27 నుంచి సర్వే
- కలెక్టర్ నాగలక్ష్మి

విజయనగరం అర్బన్: వివిధ సామాజిక వర్గాల జనాభా సంఖ్యను తెలుసుకునే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న కులగణన సర్వేకు జిల్లాల్లో కసరత్తు ప్రారంభమైంది. ఈ మేరకు ఈ నెల 14 నుంచి వివిధ స్థాయిల్లో శిక్షణ సాగుతోంది. ఇందులో భాగంగా మాస్టర్‌ట్రైనీలు తొలుత మండల స్థాయి ట్రైనీలకు టెలికాన్ఫరెన్స్ ద్వారా గురువారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా కలెక్టర్ నాగలక్ష్మి మాట్లాడుతూ ప్రభుత్వ విధాన నిర్ణయాలను రూపొందించడానికి, సంక్షేమ పథకాలను అమలు చేయడానికి ఈ సర్వే వివరాలు దోహదపతాయని పేర్కొన్నారు. ఈ నెల 27 నుంచి జిల్లావ్యాప్తంగా కులగణన ప్రారంభం కానుందని చెప్పారు. గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల ద్వారా కులగణన సర్వే జరుగుతుందని దీనికి జిల్లా యంత్రాంగం సిద్ధం కావాలని ఆదేశించారు. కులగణన గురించి ముందుగానే వలంటీర్ల ద్వారా ఇంటింటి ప్రచారం నిర్వహించి, అపోహలను తొలగించాలని సూచించారు. సర్వేలో కుంటుంబసభ్యులు చెప్పిన వివరాలనే నమోదు చేయాలని వాటికి సంబంధించిన ధ్రువీకరణ పత్రాలను అడగనవసరం లేదని స్పష్టం చేశారు. కులాంతర వివాహాలు చేసుకున్న వారికి ఎవరి కులం వారికే నమోదు చేయాలని చెప్పారు. ఎవరైనా కులం పేరు చెప్పడానికి ఇష్టపడకపోతే వారిని బలవంతం చేయకూడదని, ఇది స్వచ్ఛందమేనన్నారు. సేకరించిన సమాచారం ప్రభుత్వం వద్ద భద్రంగా ఉంటుందని దీనిని ఏ ప్రైవేట్ సంస్థకు, వ్యక్తులకు ప్రభుత్వం వెల్లడించబోదని చెప్పారు.


టెలికాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి

కులగణనలో భాగంగా ఈ నెల 27 నుంచి వారంరోజుల పాటు మొబైల్ యాప్ ద్వారా డోర్ టూ డోర్ సర్వే నిర్వహిస్తారు. రెవెన్యూ, పంచాయతీ రాజ్, మున్సిపల్ శాఖ, ప్లానింగ్, సంక్షేమ శాఖల నుంచి ఎంపిక చేసిన సూపర్‌వైజర్‌లు ఈ సర్వేను పర్యవేక్షిస్తారు. గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది, వలంటీర్ల ద్వారా ప్రతి సచివాలయం పరిధిలో ఇంటింటికీ వెళ్లి కులగణన చేస్తారు. ముందుగానే వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి కులగణన గురించి వివరిస్తారు. మండల స్థాయిలో తహసీల్దార్లు, ఎంపీడీఓలు, ఈఓపీఆర్‌డీఓలు, మండల ప్రత్యేకాధికారులు ఈ సర్వేను పర్యవేక్షిస్తారు. వివరాల నమోదు కోసం ప్రత్యేక యాప్ త్వరలో అందుబాటులోకి రానుంది. కులగణన కోసం గ్రామ, మండల స్థాయితోపాటు, జిల్లా స్థాయిలో కూడా శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తారు. వివిధ కుల సంఘాలైన ఎస్సీ, ఎస్టీ, బీసీ సంఘాలను పిలిచి కులగణన గురించి వివరిస్తారు. ప్రతి వ్యక్తి వివరాలు నమోదు చేసినప్పుడు ఈకేవైసీ తప్పనిసరిగా చేస్తారు. వయసు 8 సంవత్సరాల లోపు ఉన్న వారికి ఈకేవైసీ తప్పనిసరి కాదు. ప్రతి కుటుంబానికి సర్వే పూర్తిచేసిన తర్వాత సచివాలయం సిబ్బంది, వలంటీర్ బయోమెట్రిక్ వేసి వివరాలను సబ్‌మిట్ చేయా లని కలెక్టర్ స్పష్టం చేశారు. శిక్షణలో జేసీ మయూర్ అశోక్, జెడ్పీ సీఈఓ కె.రాజ్‌కుమార్, సీపీఓ పి.బాలాజీ, డీఎల్‌డీఓ నిర్మలాదేవి, ప్రత్యేకాధికారులు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలు, తహసీల్దార్లు పాల్గొన్నారు.

కుటుంబ సభ్యుల వివరాలు

కుటుంబసభ్యుని పేరు, తండ్రి పేరు, జెండర్, పుట్టిన తేదీ, వైవాహిక స్థితి, కులం, ఉపకులం, మతం, విద్యార్హత, ప్రస్తుతం చేస్తున్న వృత్తి.

- వ్యవసాయ భూమి వివరాలు
- నివాస స్థలం వివరాలు.

సర్వేలో సేకరించే వివరాలివే..

కుటుంబం అందుబాటులో ఉన్నారా/మరణించారా/శాశ్వతంగా వలస వెళ్లారా జిల్లా, జిల్లా కోడ్, మండలం/మున్సిపాలిటీ, గ్రామం, పంచాయతీ/ పంచాయతీ కోడ్, వార్డు నంబర్, ఇంటినంబర్ కుటుంబ పెద్ద పేరు, ఆధార్ నంబర్, కుటుంబసభ్యుల సంఖ్య, కుటుంబ సభ్యుని పేరు, కుటుంబ పెద్దతో గల సంబంధం, రేషన్ కార్డు నంబర్ కుటుంబం నివాసం ఉంటున్న ఇల్లు (కచ్చా, శ్లాబ్, డ్యూప్లెక్)

- ప్రస్తుతం చిరునామా
- మరుగుదొడ్డి సౌకర్యం ఉందా లేదా?
- మంచి నీరు/తాగునీరు సదుపాయం ఉందా? (వీధి కుళాయి, బోర్‌వెల్, పబ్లిక్ బోర్‌వెల్, సొంతకుళాయి)
- పశు సంపద ఏమైనా కలిగి ఉన్నారా? (ఆవులు, గేదెలు, మేకలు, గొర్రెలు)
- వంట సాధనం (ఎల్‌పీజీ గ్యాస్, కిరోసిన్, కట్టెలు).

27 నుంచి కులగణన ప్రారంభం

పార్వతీపురం: కులగణన ఈనెల 27 నుంచి పార్వతీపురం మన్యం జిల్లాలో ప్రారంభమవుతుందని జాయింట్ కలెక్టర్ ఆర్.గోవిందరావు తెలిపారు. కులగణన ప్రక్రియపై గురువారం ఆయన కలెక్టరేట్‌లోని సమావేశ మందిరం నుంచి జిల్లా అధికారులు, మండలఅధికారులతో వర్చువల్‌గా, కులసంఘాలతో ప్రత్యక్షంగా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆర్డీఓలు కె.హేమలత, ఎస్.లావణ్య, డీపీఓ డి.సత్యనారాయణ, సీపీఓ పి.వీర్రాజు తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న జేసీ గోవిందరావు

పాత్రికేయ వ్యవస్థ పవిత్రమైనది

- సెంచూరియన్ వర్సిటీ చాన్స్‌లర్ జీఎస్ఎన్.రాజు

విజయనగరం: సమాజానికి చుక్కానిగా వ్యవహరించే పాత్రికేయ వ్యవస్థ అత్యంత పవిత్రమైనదని సెంచూరియన్ విశ్వవిద్యాలయం చాన్స్‌లర్ జీఎస్ఎన్.రాజు అన్నారు. ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ సంఘం జిల్లా అధ్యక్షుడు సముద్రాల గురుప్రసాద్ ఆధ్వర్యంలో గురజాడ స్మారక కేంద్ర గ్రంథాలయంలో గురువారం జరిగిన జాతీయ పత్రికా దినోత్సవంలో ఆయన పాల్గొని ప్రసంగించారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ పత్రికలు ప్రజాస్వామ్యానికి పట్టుకొమ్మల్లా నిలుస్తాయన్నారు. నాలుగు దశాబ్దాలుగా పాత్రికేయ రంగానికి విశిష్ట సేవలందిస్తున్న అనకాపల్లికి చెందిన కాండ్రేగుల కల్యాణ్ రామ్‌కు 2023 సంవత్సరానికి గాను జాతీయ పత్రికా దినోత్సవ పురస్కారాన్ని అందజేశారు. అదేవిధంగా 200 మంది ఇంజినీరింగ్, బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ విద్యార్థులకు ప్రశంసపత్రాలు, పతకాలను ప్రదానం చేశారు. గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకుంటూ ఉత్తమబుక్ రీడర్స్‌గా నిలిచిన కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయానికి చెందిన 20 మంది విద్యార్థులకు ప్రశంసాపత్రాలు, పతకాలు అందజేశారు. కార్యక్రమంలో సత్య విద్యాసంస్థల డైరెక్టర్ డాక్టర్ ఎం.శశిభూషణరావు, కుసుమంచి ఫౌండేషన్ వ్యవస్థాపకుడు కుసుమంచి సుబ్బారావు, ప్రముఖ వైద్యురాలు డాక్టర్ సన్యాసమ్మ, ట్రైబల్ యూనివర్సిటీ పరిపాలనాధికారి డాక్టర్ సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రెండుపూరిళ్లు, పశువులశాల దగ్ధం


దగ్ధమైన పూరిళ్లు

బలిజిపేట: మండలంలోని అజ్జాడ గ్రామంలో గురువారం జరిగిన అగ్నిప్రమాదంలో రెండు పూరిళ్లు, ఒక పశువుల శాల దగ్ధమయ్యాయి. ఈ ప్రమాదంలో సుమారు రూ.2లక్షల వరకు ఆస్తినష్టం సంభవించి ఉంటుందని గ్రామస్తుల అంచనా. గ్రామానికి చెందిన గెంబలి జయమ్మ, గొడబ రవణల పూరిళ్లు ప్రమాదంలో దగ్ధం కాగా జి.ఫకీరు పశువులశాల కాలిపోయింది. జయమ్మ ఇంటివద్ద వంటపనిచేస్తుండగా ప్రమాదం సంభవించినట్లు గ్రామస్తులు తెలిపారు. నివాసగృహాలలోని నిత్యావసర సరుకులు, డబ్బులు, వంటపాత్రలు పూర్తిగా కాలిపోవడంతో బాధితులు రోడ్డుపై పడ్డారని గ్రామస్తులు చెప్పారు. ఈ ప్రమాదంపై అధికారులు స్పందించి బాధితులకు న్యాయం చేయాలని కోరుతున్నారు.

ముక్కాంలో కాలిన ఇల్లు

భోగాపురం: మండలంలోని ముక్కాం గ్రామంలో గురువారం మధ్యాహ్నం జరిగిన అగ్నిప్రమాదంలో ఓ ఇల్లు దగ్ధమైంది. గ్రామానికి చెంఇన మైలపల్లి రాము కమ్మల ఇల్లు కాలిపోయినట్లు సమాచారం అందుకున్న వీఆర్‌ఓ లక్ష్మి గ్రామానికి చేరుకుని బాధిత కుటుంబసభ్యులను పరామర్శించారు. సుమారు రూ.30 వేల వరకు ఆస్తినష్టం జరిగినట్లు వీఆర్‌ఓ అంచనా వేశారు.


శృంగవరపుకోట: మరుపల్లిలో కాలిపోతున్న ఇళ్లు

మరుపల్లిలో నాలుగు ఇళ్లు..

శృంగవరపుకోట: మండలంలోని బొడ్డవర పంచాయతీ పరిధి కొత్త మరుపల్లి గ్రామంలో గురువారం మధ్యాహ్నం నాలుగు పూరిళ్లు దగ్ధమయ్యాయి. గ్రామానికి చెందిన సోకుల కొండమ్మ ఇంట్లో షార్ట్‌సర్క్యూట్ కారణంగా మంటలు రేగి గ్యాస్‌స్టవ్, బట్టలు, వస్తుసామగ్రికి వ్యాపించాయి. అలాగే ఆ ఇంటి పక్కనే ఉన్న చింతల మల్లేష్, దురిమి ఎర్నాయుడు, పొన్నకాయల రాములమ్మ, ఇళ్లకు మంటలు విస్తరించడంతో ఒక్కసారిగా నాలుగు పూరిళ్లు కాలిపోయాయని బాధితులు వాపోయారు. ప్రమాద వార్త తెలుసుకున్న అగ్నిమాపక సిబ్బంది గ్రామానికి వచ్చి మంటలు అదుపుచేశారు. ఈ ప్రమాదంలో రూ.9.5లక్షల మేర ఆస్తినష్టం జరిగిందని, మరో రూ.20లక్షల నష్టాన్ని నివారించ గలిగామని ఎస్ఎఫ్ఓ మదీనా చెప్పారు.

ఘనంగా పైడితల్లి అమ్మవారి చండీయాగం

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి శ్రీ పైడితల్లి అమ్మవారి చండీయాగం స్థానిక రైల్వేస్టేషన్ వద్దనున్న వనంగుడిలో గురువారం ఘనంగా జరిగింది. ఆలయ వేదపండితులు సాయికిరణ్, వెలువలపల్లి నరసింహమూర్తిలు అమ్మవారి యాగాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం యాగ విశిష్టతను భక్తులకు వివరించారు. యాగంలో పాల్గొన్న భక్తులకు అమ్మవారి తీర్థప్రసాదాలు, శేషవస్త్రాలను అందజేశారు. కార్యక్రమాలను ఆలయ ఈఓ కేఎల్.సుధారాణి పర్యవేక్షించారు


చండీయాగం నిర్వహిస్తున్న వేదపండితులు

సెంచూరియన్‌లో ముగిసిన 'బయోవియో'

నెల్లిమర్ల రూరల్: మండలంలోని టెక్కలి సెంచూరియన్ విశ్వ విద్యాలయంలో నిర్వహించిన 'న్యూ డ్రగ్ అండ్ మెటీరియల్ డిస్కవరీ, యూజింగ్ బయోవియో డిస్కవరీ అండ్ మెటీరియల్ స్టూడియో' అనే జాతీయ స్థాయి కార్యక్రమం గురువారంతో ముగిసింది. పర్యావరణానికి హాని కలగకుండా గ్రీన్ టెక్నాలజీని ఉపయోగించి డసాల్ట్ రూపొందించిన బయోవియో సాఫ్ట్‌వేర్ సహకారంతో విద్యార్థులు ప్రయోగాలు చేపట్టారు. వీసీ ప్రొఫెసర్ ప్రశాంతకుమార్ మహంతి, రిజిస్ట్రార్ డాక్టర్ పల్లవి ప్రయోగాలను పర్యవేక్షించారు. కార్యక్రమంలో వర్సిటీ ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సుల్లో గిఫ్ట్ స్కీం

శ్రీకాకుళం అర్బన్: శ్రీకాకుళం ఒకటి, రెండు డిపోల పరిధిలో పలు రూట్లలో తిరిగే ఆర్టీసీ బస్సుల్లో గిఫ్ట్ స్కీం ఏర్పాటు చేసినట్లు డిపో మేనేజర్లు పి.మల్లికార్జునరాజు, కె.ఆర్.ఎస్.శర్మ తెలిపారు. ఈ మేరకు శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్‌లో గురువారం ఆమదాలవలస బస్సులో గిఫ్ట్ స్కీం బాక్స్‌ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆమదాలవలస, బందరువానిపేట, చీపురుపల్లి, సాలూరు, శ్రీముఖలింగం, గుత్తావల్లి, యరగాం, విజయనగరం తదితర మార్గాల్లో ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం చేసే వారు గమ్యస్థానంలో దిగే ముందు టికెట్ వెనుక పేరు, ఫోన్ నంబర్ రాసి బస్సులో ఏర్పాటు చేసిన గిఫ్ట్ బాక్స్‌లో వేయాలని కోరారు. ప్రతి నెలా 3, 17వ తేదీల్లో డ్రా తీసి విజేతలకు జీఎస్‌వీ జ్యువలెర్స్(శ్రీకాకుళం) సౌజన్యంతో ఆకర్షణీయమైన బహుమతులు అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్లు వి.రమేష్, ఎ.గంగరాజు, ఎస్ఎం కె.నరేంద్ర, టీఐ-3 ఎల్ఎస్ నాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.


బస్సులో గిఫ్ట్ బాక్స్ ఏర్పాటు చేసిన దృశ్యం

అడవి జంతువు మాంసం వాటాలు

- 23 మందిపై కేసు నమోదు

పాతపట్నం: అడవి జంతువు మాంసాన్ని వాటాలుగా పంచుకున్న 23 మందిపై కేసు నమోదు చేసినట్లు పాతపట్నం ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ ఆర్.రాజశేఖర్, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ పి.యశస్వీ తెలిపారు. ఈ ఘటన గురువారం తెల్లవారుజామున జరగ్గా సాయంత్రం వెలుగులోకి వచ్చింది. గురువారం తెల్లవారు జామున కొండపై నుంచి కొండమేక పెద్దసీది గ్రామంలోకి వచ్చింది. కుక్కలు తరిమి దాడి చేయడంతో కొండమేక మృతి చెందింది. గ్రామానికి చెందిన 24 మంది కొండమేక మాంసాన్ని వాటాలు వేసుకుని పంచుకున్నారు. విషయం పాతపట్నం ఫారెస్ట్ అధికారులకు తెలియడంతో వెంటనే పెద్దసీది ఫారెస్టు సిబ్బంది చేరుకుని నిందితులను గుర్తించారు. వన్యప్రాణి సంరక్షణ చట్టం 1972 ప్రకారం కేసు నమోదు చేశారు.

పోలీసుల అదుపులో క్రికెట్ బెట్టింగ్ రాయుళ్లు

బొండపల్లి: వరల్డ్‌కప్ క్రికెట్ (ఇండియా-న్యూజిల్యాండ్) సెమీఫైనల్ మ్యాచ్ సందర్భంగా బొండపల్లి మండలంలోని దేవుపల్లి గ్రామంలో బెట్టింగ్ నిర్వహిస్తున్న ముగ్గురు వ్యక్తులను బుధవారం అదుపులోకి తీసుకున్నట్లు ఆంధ్ర ఎస్సై ఎస్.సిద్ధార్థ కుమార్ గురువారం తెలిపారు. గ్రామానికి చెందిన ముగ్గురు వ్యక్తులు బెట్టింగ్ నిర్వహిస్తున్నట్లు అందిన సమాచారం మేరకు దాడి చేసి వారి నుంచి ఒక సెల్‌ఫోన్‌తో పాటు రూ.2 వేల నగదును స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. అదుపులోకి తీసుకున్న వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు నిర్వహిస్తున్నామన్నారు.

బాక్సింగ్ విజేతలకు డిప్యూటీ స్పీకర్ అభినందన


బాక్సింగ్ విజేతలను అభినందిస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

విజయనగరం: రాష్ట్రస్థాయిలో జరిగిన బాక్సింగ్ పోటీల్లో విజేతలుగా నిలిచిన జిల్లా క్రీడాకారులను ఏపీ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అభినందించారు. ఇటీవల విశాఖలో జరిగిన పోటీల్లో పతకాలు సాధించిన క్రీడాకారులు గురువారం ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో రెండు రజత, మూడు కాంస్య పతకాలను సాధించినట్లు క్రీడాకారులు ఈ సందర్భంగా కోలగట్లకు తెలియజేశారు. అలాగే ఓవరాల్ చాంపియన్ షిప్‌లో మూడవ స్థానంలో నిలిచినట్లు చెప్పారు. రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా క్రీడాకారులు సాధించిన ఘనతపై కోలగట్ల హర్షం వ్యక్తం చేస్తూ వారిని అభినందించారు. క్రీడాస్ఫూర్తితో మరింతగా రాణించి నగరానికి ఖ్యాతిని తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో బాక్సింగ్ కోచ్‌లు సీతారామాంజనేయులు, రామకృష్ణ, సతీష్, బాక్సింగ్ విజేతలు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో విద్యార్థికి గాయాలు

మందస: మండలంలోని మఖరజోల గ్రామ సమీపంలో 16వ నంబరు జాతీయ రహదారిపై గురువారం రోడ్డు ప్రమాదం జరిగింది. పలాస మండలం రామకృష్ణపురం సమీపంలోని ఓ ప్రైవేటు స్కూల్‌కు చెందిన బస్సు మందస మండలంలోని విద్యార్థులను తీసుకెళ్తుండగా, ఇచ్ఛాపురం నుంచి పలాస వైపు వెళ్తున్న డిఫెన్స్ సెక్యూరిటీ స్కార్పియో వాహనాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో ఓ చిన్నారికి స్వల్పగాయాలయ్యాయి. ఈ ఘటనపై ఎటువంటి ఫిర్యాదు అందలేదని ఎస్ఐ సీహెచ్ హరికృష్ణ చెప్పారు.

ఫెర్టిలిటీ కేంద్రాలు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి

- డీఎంహెచ్‌ఓ భాస్కరరావు

విజయనగరం ఫోర్ట్: సరోగసి రెగ్యులేషన్ చట్టం -2021 ప్రకారం జిల్లాలో ఫెర్టిలిటీ కేంద్రాలను నిర్వహిస్తున్న వారు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎస్.భాస్కరరావు తెలిపారు. ఫెర్టిలిటీ కేంద్రాలు, క్లినిక్స్, బ్యాంక్స్ రిజిస్ట్రేషన్ కోసం అసిస్టెడ్ రీ ప్రొడక్టివ్ టెక్నాలజీ (ఏఆర్టీ) పోర్టల్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తులను జిల్లాస్థాయి పర్యవేక్షణ టీమ్ పరిశీలించి రాష్ట్రస్థాయికి సాఫారసు చేస్తుందని చెప్పారు. అక్కడ పరిశీలన తర్వాత అర్హత ఉన్న కేంద్రాలకు సర్టిఫికెట్ జారీ చేస్తారన్నారు. రిజిస్ట్రేషన్ లేకుండా ఎవరైనా కేంద్రాలను నిర్వహిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గతంలో గర్భస్థ లింగ నిర్ధారణ ఎంపిక నిషేధ చట్టం 1994 ప్రకారం అనుమతి పొందిన స్కానింగ్ కేంద్రాల్లో ఫెర్టిలిటీ సేవలు అందిస్తున్నట్లయితే వారు కూడా తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలని స్పష్టం చేశారు.

స్కూల్‌గేమ్స్‌లో నెల్లిమర్ల విద్యార్థుల ప్రతిభ

నెల్లిమర్ల: ఆంధ్రప్రదేశ్ స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో కర్నూలు జిల్లా ఎమ్మిగనూరులో అండర్-17 విభాగంలో జరిగిన ఫుట్‌బాల్ పోటీల్లో నెల్లిమర్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాల పదవ తరగతి విద్యార్థి వి.హరిబాబు జట్టు రన్నరప్‌గా నిలిచింది. అలాగే తిరుపతిలోని శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో జరిగిన అండర్-19 విభాగం రాష్ట్రస్థాయి ఈత పోటీల్లో పాఠశాలకు చెందిన ఏడుగురు విద్యార్థులు పాల్గొన్నారు. త్రోబాల్ అండర్-19 విభాగంలో ఎస్.పూర్ణచంద్ర రెడ్డి, ఫుట్‌బాల్ అండర్-14 విభాగంలో ఎం.హర్షవర్ధన్ నాయుడు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వారందరినీ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సీహెచ్.ఆనందమూర్తి, వ్యాయామ ఉపాధ్యాయిని ప్రమీల పాత్రో, ఇతర ఉపాధ్యాయులు అభినందించారు.


రాష్ట్రస్థాయి విజేతలను అభినందిస్తున్న హెచ్‌ఎం ఆనందరావు

గుర్తు తెలియని యువకుడి మృతదేహం లభ్యం

లక్కవరపుకోట: మండలంలోని సంతపేట గ్రామం సమీపంలో గల శాంభవి లేఅవుట్‌లో ఒక మదుం వద్ద గుర్తు తెలియని యువకుడి(34) మృతదేహాన్ని స్థానికులు గురువారం రాత్రి గుర్తించారు. అటుగా వెళ్లే యువకులు మృతదేహన్ని చూసి పోలీసులకు సమాచారం అందించారు. దీంతో ఎస్సై ఎస్.ముకుందరావు సిబ్బందితో వెళ్లి మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడి శరీరంపై టీషర్ట్, షార్ట్ ఉన్నట్లు ఎస్సై తెలిపారు.మృతదేహంపై ఎక్కడా ఎటువంటి దెబ్బలు, గాయాలు లేవని చెప్పారు. ఎక్కడో పూటుగా మద్యం తాగి తిరిగి మంచినీరు దొరక్క మృతి చెందాడేమోనని పోలీసులు అనుమానిస్తున్నారు. మృతదేహాన్ని ఎస్.కోట సీహెచ్‌సీకి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ముకుందరావు తెలిపారు.


గుర్తు తెలియని యువకుడి మృతదేహం

పురిల్లు దగ్ధం

పాతపట్నం : మండలంలోని ఆర్.ఎల్.పురం ఎస్టీ వీధిలో పాసి సూకయ్యకు చెందిన పురిల్లు గురువారం ఉదయం జరిగిన అగ్ని ప్రమాదంలో దగ్ధమైంది. సూకయ్య, భార్య కాంతమ్మలు కలిసి కొండపై పోడు వ్యవసాయానికి వెళ్లిపోయారు. ఆ సమయంలో ఇంట్లో మంటలు వ్యాపించడంతో ఇరుగుపొరుగు వారు గుర్తించి మంటలను ఆపే ప్రయత్నం చేశారు. అనంతరం టెక్కలి అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇవ్వడంతో సిబ్బంది చేరుకుని మంటలను పూర్తిస్థాయిలో అదుపులోకి తెచ్చారు. అప్పటికే సామాన్లు, దుస్తులు కాలిబూడిదయ్యాయని బాధితులు వాపోయారు. బాధితురాలు కాంతమ్మ మాజీ సర్పంచ్‌గా కూడా సేవలందించారు. రెవెన్యూ సిబ్బంది వివరాలు సేకరించారు.


మంటలు అదుపు చేస్తున్న గ్రామస్తులు

మార్కెట్‌కు చవితి శోభ

నాగుల చవితి సందర్భంగా జిల్లాలోని పలు మార్కెట్లు కొనుగోలుదారులతో కిటకిటలాడాయి. గురువారం కాశీబుగ్గ బస్టాండ్ ఆవరణలో ఉద్దాన రైతు మార్కెట్‌కు జనం భారీగా తరలివచ్చి పూజా సామగ్రి కొనుగోలు చేశారు. కలగూర, పూలు, పండ్లు కొనుగోలుకు ఆసక్తి చూపారు. ముఖ్యంగా పుట్టలో వేసేందుకు అవసరమైన నాటు కోడిగుడ్లకు గిరాకీ ఏర్పడింది.

- కాశీబుగ్గ


అరటికాయలు, ఆకులు అమ్ముతున్న మహిళ


నాటుకోడిగుడ్లు అమ్ముతున్న మహిళ


సందడిగా కాశీబుగ్గ ఉద్దాన రైతు మార్కెట్